

తిరుపతి @ 894

తిరుపతి పుట్టిన రోజు వేడుకలకు సర్వం సిద్ధమైంది. తోరణాలు, విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. - 8లో



ఉద్యోగులపైకి దూసుకొచ్చిన కారు

ఏర్పేడు మండలంలోని చింతలపాళెం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఓ కారు ఉద్యోగుల పైకి దూసుకొచ్చింది. - 8లో



పోలింగ్ కేంద్రాల్లో..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్టు కలెక్టర్ జీ.లక్ష్మీశ స్పష్టం చేశారు. - 8లో

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024

న్యూస్‌రీల్

నేడు త్రిశూల స్నానం



సద్యోముక్తి క్షేత్రంలో త్రిశూలస్నాన ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు నాందిగా శనివారం స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి వ్రతం, త్రిశూల స్నానం కోసం ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమీక్ష



అర్చకులతో సమావేశమైన ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలనా భవనంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై ఈఓ నాగేశ్వరరావు అర్చకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ మార్చి 3 నుంచి 16వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో అందరూ సమన్వయంతో విజయవంతం చేద్దామన్నారు.

వైభవంగా స్త్రీల పూజ



మలయాళస్వామి పాదుకలకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు

ఏర్పేడు: స్థానిక వ్యాసాశ్రమంలో 87వ అఖండ గురుపూజోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం వైభవంగా స్త్రీల పూజ నిర్వహించారు. ఉత్సవాలు వ్యాసాశ్రమ కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి తమ కుటీరం నుంచి ఊరేగింపుగా మలయాళస్వామి అధిష్టాన మందిరానికి చేరుకుని అక్కడ స్వామివారి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు మలయాళ స్వామి పాదుకలకు పూజలు చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వమించారు.

నేడు ఇంటర్ పరీక్షలపై సమావేశం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై శనివారం ఉదయం 10గంటలకు తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి పరీక్ష నిర్వహణాధికారులైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, అదనపు సీఎస్‌లు, కస్టోడియన్లు తప్పకుండా హాజరవ్వాలని కోరారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 19 వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు 2 నుంచి 20వ తేదీ వరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 87 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఈ నెల 23వ తేదీ నుంచి 'బీఐఈఏపీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఈ హాల్ టికెట్‌పై కళాశాల ప్రిన్సిపల్ సంతకం అవసరం లేదని ఆర్ఐఓ తెలిపారు.

గ్రూప్-2కు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

తిరుపతి అర్బన్: జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ పెంచలకిషోర్, గ్రూప్-2 పరీక్షల విభాగం అడిషనల్ సెక్రటరీ వెంకటలక్ష్మితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25న ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కోట, గూడూరు మండలాల్లో మొత్తం 61 పరీక్షా కేంద్రాలలో 27,894 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు వెల్లడించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని స్పష్టం చేశారు. అదనపు సమాచారం కోసం 90006 65565, 96769 28804 సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారు

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శుక్రవారం ఈ మేరకు పర్యటన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. వివరాలు ఇలా..

- 26వ తేదీన గన్నవరం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమానంలో బయలుదేరి ఉదయం 9.35 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9.45కి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.25 గంటలకు కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 10.40 గంటలకు రాజుపేట గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కాలువ వద్దకు చేరుకుంటారు. అక్కడ పూజలు నిర్వహించి కాలువలో నీటిని విడుదల చేస్తారు.
- అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి 11 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.15 గంటలకు శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె చేరుకుంటారు.
- 11.25 గంటలకు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 1.10 గంటలకు సభాస్థలి నుంచి హెలీప్యాడ్‌కు చేరుకుని, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతారు.
- 2.20 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో గన్నవరానికి తిరుగుప్రయాణమవుతారు.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,973 మంది స్వామివారిని దర్శించుకోగా 21,722 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.95 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

'చిన్న తనంలో మా ఉపాధ్యాయుడు కొర్లగుంట కృష్ణయ్య చెప్పిన మాటలే పేదల పట్ల సేవా నిరతిని నేర్పాయి. నా చిన్నతనంలో బస్టాండ్ వద్ద బస్సు ఆగే సమయానికి ఓ భక్తుడు వాంతులు చేసుకుంటే.. ఓ బిడ్డ దాన్ని వాంతి అని చూడకుండా తినడం గుండెల్ని పిండేసింది. నా జీవితం ఇంతటి విషాదాన్ని చూడలేదు. మా తల్లి కన్నుమూసిన సమయంలో కూడా అంతటి వేదనకు గురికాలేదు. సామాజిక సేవా దృక్పథాన్ని ఆ సంఘటన నుంచి మరింత స్ఫూర్తి పొందాను. పేదవాళ్ల పక్షాన నిలవడం నా బాధ్యత, నా కర్తవ్యం అని భావిస్తూ వస్తున్నాను. దేశాధ్యక్ష పదవి కంటే శ్రీవారికి, ఆయన భక్తులకు, ఉద్యోగులకు సేవ చేసుకునే టీటీడీ చైర్మన్ పదవే గొప్పదని భావిస్తున్నా.' అని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. టీటీడీ ఉద్యోగ సంఘాల 'కృతజ్ఞతా సభ.. ఆత్మీయ సన్మానం' కార్యక్రమంలో తనలో స్ఫూర్తి నింపి.. సేవాభావం వైపు నడిపిన పలు ఆసక్తికర సంఘటనలను ఉద్యోగులతో పంచుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

మీ సేవకుడిని నేను!

- పేదల పక్షాన నిలబడి సమస్యలు పరిష్కరిస్తా
- టీటీడీ ఉద్యోగులు నా ఆత్మబంధువులు
- త్వరలో పాలకమండలి సమావేశంలో మరో శుభవార్త
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ, తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల అభ్యున్నతే ధ్యేయంగా తాను శక్తివంచనలేకుండా శ్రమిస్తానని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనం వేదికగా టీటీడీ ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మరో మారు టీటీడీ చైర్మన్‌గా ఉద్యోగులకు సేవ చేసే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. చిన్ననాటి తెలుగు పండితులు కొర్లగుంట క్రిష్ణయ్య పేదల పక్షపాతిగా నిలవడం చదువుకంటే ముఖ్యమని బోధించిన సంఘటన తనకు స్ఫూర్తిదాయకమని గుర్తుచేసుకున్నారు. అభ్యుదయ భావాలతో పెరిగిన తనకు ఆత్మీయ నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి టీటీడీ చైర్మన్‌గా మొదటి సారి అవకాశం కల్పించారని గుర్తుచేసుకున్నారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, పేదలకు అండగా ఉండాలనేది తన కర్తవ్యంగా భావిస్తానని స్పష్టంచేశారు. సీఎం జగనన్న ఆశీస్సులతో ఉద్యోగుల చిరకాల వాంఛ సొంతింటి కలను నెరవేర్చడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ధార్మిక సంస్థలో చిన్న ఉద్యోగులకు రూ.6వేలు మాత్రమే వేతనాలు అందుతుండడం బాధకలిగించిందని చెప్పారు. వెంటనే ఈఓ, జేఈఓలతో చర్చించి భారీ ఎత్తున జీతాలు పెంచామని గుర్తుచేశారు. ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం పేదకుటుంబాల నుంచి కష్టనష్టాలు అనుభవించి వచ్చిన వ్యక్తులు కాబట్టే పేద ఉద్యోగుల అవసరాలను గుర్తించి సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు.



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి పుష్పాభిషేకం

శ్రామికుడిగా పనిచేస్తా

ఉద్యోగుల ప్రతి సమస్యను పరిష్కరించేదుకు తాను శ్రామికుడిగా పనిచేస్తానని శ్రీవారి సాక్షిగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రానున్న పాలకమండలిలో ఉద్యోగులకు మరింత మేలు జరిగే నిర్ణయాలు తీసుకుని శుభవార్త చెప్పనున్నట్లు వెల్లడించారు.

చిరకాలం గుర్తుపెట్టుకుంటా

భిన్న అభిప్రాయాలతో ఉండే ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం జరగడం మరువలేని విషయమన్నారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేసి దేశంలోనే ప్రధాన నగరంగా తిరుపతికి గుర్తింపు తెస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జేఈఓ వీరబ్రహ్మం మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకుని పేదల పక్షపాతిగా నిలిచి 30ఏళ్ల కల సాకారం చేసిన వారి జీవితాలలో వెలుగులు నింపిన ఘనత చైర్మన్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జీఓ నం.114ను టీటీడీలో అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. ఉద్యోగ సంఘ నాయకులు వెంకటేశన్, ఆంజనేయులు, చీర్ల కిరణ్, వెంకటరమణారెడ్డి, హేమలత, ఇందిర, పెద్ద సంఖ్యలో టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం

ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చి, సుమారు 8 వేల కుటుంబాలలో వెలుగులు నింపిన మహనీయుడు టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి అని టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు కొనియాడారు. 30 ఏళ్ల కలను నెరవేర్చారని, తాత్కాలిక ఉద్యోగుల జీతభత్యాలు 50శాతం మేర పెంచారని తెలిపారు. చారిత్రాత్మక నిర్ణయాలతో ఉద్యోగుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న చైర్మన్‌కు అండగా ఉండి రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. టీటీడీలో ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న రమణదీక్షితులు పాలక మండలి, ఉద్యోగులపైన అసత్యప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు. ఆయనను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం టీటీడీ చైర్మన్‌ను వేదమంత్రాల నడుమ గజమాలతో ఘనంగా సత్కరించారు.



కరుణాకరరెడ్డికి భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న టీటీడీ ఉద్యోగ సంఘాలు

రాష్ట్రంలో జనరంజక పాలన

జగనన్న అజెండాకే ప్రజా దీవెనలు

- ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు
- ప్రజలే కుటుంబంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి సేవా కార్యక్రమాలు
- చంద్రగిరి ప్రజల రుణం తీర్చుకోలేనిది
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి వెల్లడి



మోహిత్‌రెడ్డికి క్రేన్ ద్వారా భారీ గజమాలను వేసి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గాంధీపురం పంచాయతీలో వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: జగనన్న ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, రాష్ట్రంలో ఎన్ని రాజకీయ పార్టీల జెండాలు జత కట్టినా జగనన్న అజెండాకు ప్రజలు మద్దతు ఇస్తారని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీలో పర్యటించి అక్కడి ప్రజలతో మమేకమయ్యారు. గ్రామశివార్లలో నుంచి యువత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. మోహిత్‌రెడ్డి సైతం యువతతో కలిసి బుల్లెట్ నడిపారు. గ్రామంలో తుడా చైర్మన్‌కు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. మొదటగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరణతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. అభివృద్ధి, సంక్షేమ జాబితా పట్టికను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలోని 54 మహిళా సంఘాలకు రూ.2.91 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కును అందించారు.

మేనిఫెస్టోలో 99శాతం హామీలు అమలు


రాష్ట్రంలో మెరుగైన ప్రజా పాలనకు సీఎం జగనన్న కీలక సంస్కరణలు చేపట్టారని, గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత ఒక్క జగనన్నకు మాత్రమే సాధ్యమైందన్నారు. నిరుపేద ప్రజల జీవితాల్లో సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పారన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆర్థిక అసమానతలను రూపుమాపి వెనుకబడిన వర్గాలకు రక్షణ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని తుడా చైర్మన్ పిలుపునిచ్చారు.

మీ రుణం తీర్చుకోలేనిది

చంద్రగిరి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త అయిన తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్కున చేర్చుకున్నారని గుర్తుచేసుకున్నారు. అందుకే ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి ఎనలేని సేవ చేస్తున్నారని వెల్లడించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మీ బిడ్డగా ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీకి నాక్ బీ ప్లస్ గ్రేడ్

తిరుపతి సిటీ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మానస పుత్రికగా పేరుగాంచిన ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి యూజీసీ నాక్ బీ ప్లస్ గ్రేడ్ వరించింది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు యూజీసీ నాక్ బృందం వర్సిటీలో బోధన, మౌలిక సదుపాయాలు, పరిశోధన అంశాల సరళికి చెందిన అంశాలపై సుదీర్ఘంగా పరిశీలించి బీ ప్లస్ గ్రేడ్ గుర్తింపు నిచ్చింది. దేశంలోని పశువైద్య విశ్వవిద్యాలయాల్లో నాక్ గుర్తింపు పొందిన ఏకైక యూనివర్సిటీగా ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిలిచింది. ఇప్పటికే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు సైతం లభించింది.



ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ముఖచిత్రం

సమష్టి కృషితోనే



వర్సిటీకి నాక్ బీ ప్లస్ గ్రేడ్ రావడం ఆనందంగా ఉంది. కళాశాల ప్రిన్సిపల్ జగపతి రామయ్యతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది కృషి ఎంతో ఉంది. వీరితోపాటు డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సర్జన్‌రావు, వీరబ్రహ్మయ్య పరిశోధనలో కొత్త పుంతలు తొక్కించారు. ఈ గుర్తింపుతో భవిష్యత్‌లో వర్సిటీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం.

– డాక్టర్ ఏ.రవి, రిజిస్ట్రార్, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ

త్వరలో కొత్త డీజిల్ బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాకు త్వరలో కొత్త డీజిల్ బస్సులు రానున్నట్టు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. జిల్లాకు విచ్చేసిన ఆయన్ను శుక్రవారం డీపీటీఓ చెంగల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ తిరుపతికి విద్యుత్ బస్సులను త్వరలో పెంచే ప్రయత్నం చేస్తామన్నారు. అంతేకాకుండా కొత్త డీజిల్ బస్సులు రాష్ట్రంలో 1,500 వస్తున్నాయని, అందులో 70 నుంచి 100 బస్సులు ముందుగా తిరుపతి జిల్లాకు పంపుతామని స్పష్టం చేశారు. ప్రయాణికులతో ఆర్టీసీ ఉద్యోగులు గౌరవంగా మెలగాలని చెప్పారు.

దేశాభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర

తిరుపతి సిటీ: దేశాభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర అని మహిళా వర్సిటీ వీసీ డీ.భారతి తెలిపారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పిలుపు నిచ్చిన పంచప్రాణ్‌లో భాగంగా యువసంవద్-ఇండియా అట్ 2047అనే అంశంపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశాన్ని పురోగతి, సమానత్వం, స్థిరత్వంవైపు నడవాలంటే యువత భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం తుడా కార్యదర్శి, ఇన్‌చార్జ్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ యువతకు ఆర్థిక, విద్యాపరమైన వృద్ధితో పాటు సాటిమనిషికి సహాయపడే బలమైన నైతిక విలువలు కలిగి ఉండాలని సూచించారు. రిజిస్ట్రార్ ఎన్.రజిని, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పీ.నీరజ, డాక్టర్ సుజాత, ప్రొఫెసర్ సువర్ణలతాదేవి, డీన్ ప్రొఫెసర్ కాత్యాయిని, శ్రీధర్, అంకిత్ పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ముఖ్యఅతిథులు

క్లుప్తంగా


పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు



జిల్లా పరిస్థితులను ఎన్నికల అధికారికి వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని పరిస్థితులను వివరించారు. గత వారంలో 6, 7, 8 ఫారాలకు సంబంధించి 8,534 పరిష్కరించినట్టు తెలిపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీ జూనియర్ కళాశాల, శ్రీపద్మావతి మహిళ విశ్వవిద్యాలయాన్ని ఓట్లు లెక్కింపునకు వినియోగించనున్నట్టు వెల్లడించారు.

తిరుపతి @ 894



సహజంగా ప్రముఖులు, రాజకీయ, వ్యాపార, సెలబ్రిటీలతో పాటు ఎక్కువ మంది పుట్టినరోజును వేడుకగా జరుపుకోవడం చూస్తుంటాం. కానీ భారతదేశంలో ఏ నగరానికీ లేని పుట్టిన రోజు ఒక్క తిరుపతి నగరానికి మాత్రమే ఉండడం విశేషం. సమతామూర్తి శ్రీ రామానుజాచార్యులు తన స్వహస్తాలతో 1130 ఫిబ్రవరి 24వ తేదీన గ్రామ ఈశాన్యంలో (నాలుగుకాళ్ల మండపం) వద్ద పునాది వేసినట్లు చరిత్రలో నిరూపితమైంది. అద్వైత పురుషుడైన సమతామూర్తి పుణ్యఫలమే తిరుపతి నగరమైంది. ఈ మేరకు శనివారం 894వ పుట్టిన రోజు వేడుకలకు తిరుపతి నగరం అత్యంత సుందరంగా ముస్తాబైంది.

నేడు తిరుపతి పుట్టిన రోజు వేడుకలు

- నాడు సమతామూర్తి స్వహస్తాలతో పునాది
- గరుడ ఆకారంలో గ్రామానికి శ్రీకారం
- నాటి గోవిందరాజపట్నమే నేటి తిరుపతి
- యాదవరాయల ద్వారా ఆలయ నిర్మాణం

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగరానికి పుట్టినరోజు ఉందన్న విషయాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేధావులు, పండితులతో కలసి 2022లో ప్రకటించారు. చరిత్ర, పురాణ, ఇతిహాసాల ఆధారంగా అద్వైత పురుషుడైన రామానుజాచార్యులు చేతుల మీదుగా తిరుపతి నగరం పురుడు పోసుకుందని సామాజానికి చాటిచెప్పారు. ఈ క్రమంలో శనివారం తిరుపతి నగర 894వ పుట్టినరోజు వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

1130వ ఏటే పునాది

శ్రీరామానుజాచార్యులు కంచి నుంచి తిరుమలకు వచ్చే క్రమంలో తన 112వ ఏట నిర్మానుష్యంగా ఉన్న పార్థసారథిస్వామి ఆలయం (నేటి గోవింద రాజస్వామి ఆలయం) ప్రాంతాన్ని ఓ గ్రామంగా నిర్ణయిస్తూ పునాది వేశారు. 1130 ఫిబ్రవరి 24వ తేదీన గ్రామానికి పునాది వేశారని స్పష్టమవుతోంది. కపిలతీర్థం సమీపంలో కొత్తూరు గ్రామం ఉండేది. వివిధ వ్యాధులతో ఆ గ్రామ వాసులు వరుసగా మృత్యువాత పడుతుండడాన్ని శ్రీరామానుజాచార్యులు గుర్తించారు. గోవిందరాజస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సందర్భంలోనే కొత్తూరు గ్రామ ప్రజలను సంరక్షించడం, నిర్మానుష్య ప్రాంతంగా ఉన్న ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు గరుడ ఆకారంలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామానికి హద్దులు పెట్టించి పునాది వేయించారు. ఆగమ శాస్త్రోక్తంగా నాడు వేసిన పునాదే నేడు ఆధ్యాత్మిక రాజధానిగా తిరుపతి దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఆ క్రమంలోనే ఆ గ్రామానికి గోవిందరాజపట్నంగా నామకరణం చేశారు. ఆ తరువాత గోవిందరాజపట్నానికి రామానుజపురంగా స్థానికులు పేరును మార్చుచేశారు. కాలక్రమేణా 13వ శతాబ్దంలో తిరుపతిగా ప్రసిద్ధికెక్కింది.

హద్దులు ఇవే

నాటి గోవిందరాజపట్నానికి కృష్ణాపురం ఠానా, నాలుగుకాళ్ల మండపం, రైల్వేస్టేషన్‌కు తూర్పు ప్రాంతం, బేరివీధి నాలుగు ప్రాంతాల్లో మండపాలను నిర్మించారు. ఆ తరువాత ఆయా ప్రాంతాల్లో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం నాలుగుకాళ్లమండపం మాత్రమే చరిత్రకు సాక్షిగా మిగిలింది.

తొలివీధి అదే

నాడు తిల్లా గోవిందరాజస్వామిని ప్రతిష్ఠించే లఘ్నం ఖరారు కావడంతో యుద్ధప్రాతిపాదికన సున్నపు ముద్దలతో గోవిందరాజస్వామి విగ్రహాన్ని సిద్ధం చేశారు. ఆ విగ్రహంలో స్వామి వారి పొట్టలో దేవదాసి తిల్లా వద్ద ఉన్న లోహవిగ్రహాన్ని ప్రతిష్ఠించి తయారు చేశారని ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. గోవిందరాజపట్నం గ్రామం ఏర్పడ్డాక రామానుజ తిరువీధి (గోవిందరాజస్వామి తూర్పు మాడావీధి) ఏర్పడింది. ఇలా తొలివీధి రామానుజ తిరువీధిగా చరిత్రలో నిలిచింది.

కైకాల రెడ్లదే తొలిదర్శనం

గోవిందరాజస్వామిని తొలినాళ్లలో దేవదాసి అయిన తిల్లా పూజిస్తూ స్వామివారి బాగోగులు చూసుకునేవారు. ఈ క్రమంలో దేవదాసి అయిన మహిళ పూజలు చేయడం ఏంటని ప్రశ్నించి అవమానించేవారు. ఈ క్రమంలోనే ఆమె కైకాల చెంగారెడ్డి అనే చిన్నారిని దత్తత తీసుకుంది. కైకాల చెంగారెడ్డి ద్వారా ఆలయంలో ఉత్సవాలు, సేవలను నిర్వహించేవారు. ఇందులో భాగంగానే నేటికీ కైకాల కులస్థులకు గోవిందరాజస్వామి ఆలయంలో తొలిదర్శనం కల్పిస్తున్నారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఉత్సవాల్లోనూ ఈ వర్గానిదే ఆధిపత్యం.

నాటి రాజావీధే నేటి గాంధీరోడ్డు

గోవిందరాజపట్నం ఏర్పడ్డాక గ్రామానికి తొలివీధిగా రామానుజ తిరువీధితో పాటు పడమర, తూర్పు, దక్షిణ మాడావీధులు శ్రీవారి అర్చకులు, వారి బంధుమిత్రులకు ఆవాసాలుగా అభివృద్ధి చెందాయి. ఆ తరువాత ఆ వీధికి బజారువీధిగా ఆపై మహాత్మాగాంధీ ఈ రోడ్డులో నడయాడంతో గాంధీ రోడ్డుగా మార్పుచెందింది. సున్నం తయారు చేస్తున్న ప్రాంతం సున్నపువీధిగా, ఇసుక నిల్వ ఉంచిన ప్రాంతాన్ని ఇసుక వీధిగా నామకరణం చేశారు. బండ్లు నిలిపే ప్రాంతమే నేటి బండ్ల వీధిగా మారినట్టు తెలుస్తోంది.



తిరుపతిలో ఏర్పాటైన రామానుజాచార్యుల కటౌట్



ముస్తాబైన గాంధీరోడ్డు

తొలి భక్తుడు ఆయనే



శ్రీమన్నారాయనుడు శ్రీవేంకటేశ్వరుడిగా సప్తగిరులపై కొలువుదీరారు. శ్రీరామానుజాచార్యుల మేనమామ అయిన శ్రీవారి పరమ భక్తుడు తిరుమల నంబి తొలిభక్తుడుగా కీర్తిగడించారు. ఆయన అనుగ్రహంతోనే అడపురి(అలిపిరి) ఓ మహావృక్షం కింద శ్రీరామానుజాచార్యులు వారు ఆద్వైత పురుషుడుగా, వైఖానస పండితులుగా ప్రసిద్ధి గడించారు. 904 ఏళ్ల క్రితం తిరుమల ఆలయ పరిరక్షణ కోసం జీయంగార్ల వ్యవస్థను తీసుకొచ్చారు.

ఇదో చారిత్రక ఘట్టం



ఏ నగరానికీ లేని పుట్టిన రోజు తిరుపతి నగరానికి మాత్రమే ఉంది. ఇది నగర ప్రజలకు దక్కిన గౌవరం. పుణ్య పురుషుడైన శ్రీ రామానుజాచార్యుల వారి చేత ఆ శ్రీమన్నారాయణుడే తిరుపతి పుణ్యక్షేత్రానికి పుణాది వేయించారు. ఈ చరిత్ర తెలియడం చారిత్రక ఘట్టమే. అందుకే తిరుపతి పుట్టిన రోజు వేడుకలను ప్రతి ఏటా జరుపుకోవడం మనందరి బాధ్యత.
– భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్.

ఇప్పటికీ గోవిందరాజపట్నంగానే..



తమిళులు ఇప్పటికీ తిరుపతిని గోవిందరాజపట్నంగానే పిలుస్తుంటారు. కపిలతీర్థం సమీపంలోని కొత్తూరు గ్రామ ప్రజలను రక్షించడం, గోవిందరాజస్వామి ఆలయాన్ని నిర్మించడం, ఈ ప్రాంతం దేదీప్యమానంగా విరాజిల్లాలన్న సంకల్పంతో గరుడ ఆకారంలో గోవిందరాజ పట్నానికి హద్దులు నిర్ణయించారు. – ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డి, ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఫౌండర్, డైరెక్టర్

వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ



లోకనాథం

తిరుపతి అర్బన్: తిరుపతిలోని స్కిల్ కాలేజీలో పలు కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జూపార్క్ సమీపంలో భారత పర్యాటక శాఖతోపాటు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలచే సంయుక్తంగా స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ప్రధానంగా డెమీ చెఫ్ ద పార్టీ (కిచెన్ సూపర్‌వైజర్)పై శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్మీడియెట్, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, 18 –28 ఏళ్ల మధ్య వయసు గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుందని, అర్హత సాధించిన వారికి 'స్కిల్ ఇండియా సర్టిఫికెట్'తోపాటు ప్రముఖ హోటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని స్పష్టం శారు. యువతీ యువకులు మార్చి 1వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం 8143576866, 9100558006, 9701343846లలో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు




పాకాల: పార్టీలోకి ఆహ్వానిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

పాకాల: మండలంలోని ఓబులశెట్టివారిపల్లి గ్రామంలో పలు కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి సమక్షంలో ఓసీ పల్లికి చెందిన రెడ్డెప్ప, వెంకటేష్ కుటుంబాల వారు పార్టీలో చేరారు. కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా వారు మాట్లాడుతూ పార్టీ విధివిధానాలు నచ్చి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. పార్టీ ఏదైనా ఎలాంటి తారతమ్యం లేకుండా జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలబడిన ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటామని చెప్పారు.

ఏర్పేడు మండలంలో వంద మంది చేరిక

ఏర్పేడు: మండలంలోని పల్లంపేట ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు వంద మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పల్లంపేట ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు దాసరి ఈశ్వరయ్య, దాసరి పండయ్య, వెంకటేష్, బాలాజీ, నాగరాజు, అంకమ్మ, మంగమ్మ, వసంత, రాజేశ్వరి, అనిల్, బన్నీ, పోలమ్మ, రాజమ్మ, భారతి, వేమాలమ్మ తదితర వంద మందికి పైగా ఎమ్మెల్సీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, నాయకులు కుమార్‌రెడ్డి, వెంకటాద్రి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఏర్పేడు: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఉద్యోగులపైకి దూసుకొచ్చిన కారు

ఏర్పేడు: మండలంలోని చింతలపాలెం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఓ కారు ఉద్యోగులపైకి దూసుకొచ్చింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ఏవీ ప్రభాకర్ రావు, ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్ సుబ్రమణ్యంకు గాయాలైనట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్ ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు.. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి ముందస్తు సమాచారం మేరకు తిరుపతి ఆర్ఎస్ఏఎస్ టీఎఫ్ ఎస్ఐ తమ సిబ్బందితో చింతలపాలెం టోల్ ప్లాజా, మరో బృందం ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో టీఎస్09 ఈఎస్5767 నంబరు కలిగిన కారు అతివేగంగా వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపునకు వెళుతుండగా ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు, ఫారెస్ట్ అధికారులు ఆపడానికి ప్రయత్నించారు. కారు అతివేగంగా చింతలపాలెం టోల్ ప్లాజా వైపు దూసుకుపోయింది. సమాచారాన్ని టోల్ ప్లాజా వద్ద ఉన్న ఎస్ఐకు సమాచారం అందించారు. టోల్ ప్లాజా వద్ద బారికేడ్లను ఏర్పాటుచేశారు. అక్కడికి వచ్చిన కారు తిరిగి ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద ఉన్న కానిస్టేబుల్ ఏవీ ప్రభాకర్‌రావు, వాచర్ సుబ్రమణ్యంను ఢీకొట్టింది. ఈ ప్రమదంలో ప్రభాకర్‌రావుకు తీవ్ర గాయాల య్యాయి. ఆ తర్వాత కారు అక్కడి నుంచి వేగంగా దూసుకెళ్లింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వినోద్‌కుమార్ సీఐకి విన్నవించారు.